సాక్షి మంచిర్యాల

శనివారం । 11 । మార్చి । 2023



సందర్శించి.. తెలుసుకుని..
ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్ఎస్ అధికారులు వివిధ మండలాల్లో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ప్రధాన వృత్తులపై అధ్యయనం చేశారు. 8లో▸

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ
రామకృష్ణాపూర్: సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు స్థలాల క్రమబద్ధీకరణకు నెలాఖరులోగా డీడీలు కట్టి రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మధుసూదన్‌నాయక్ తెలిపారు. శుక్రవారం క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం జీఓ నెంబరు 76 తీసుకువచ్చి అవకాశం కల్పించిందని, ఈ నెల 31 తర్వాత స్థలాల క్రమబద్ధీకరణకు మళ్లీ అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.0 /21.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

17న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

నస్పూర్: ఈ నెల 17న పాత మంచిర్యాలలోని పద్మావతి గార్డెన్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, అర్హుల జాబితాలోని వారి ఇప్పటికే టోకెన్లు అందజేశామని అన్నారు. ఇళ్లను మహిళల పేరిట కేటాయిస్తామని, టోకెన్లు పొందిన మహిళలు ఆధార్ కార్డులను వెంట తీసుకు రావాలని సూచించారు. గతంలో ప్రభుత్వ హౌసింగ్ పథకంలో లబ్ధి పొందిన 43మందికి ఇచ్చిన టోకెన్లు రద్దు చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల ఆర్డీఓ వేణు, సీఐ రాజు, తహసిల్దార్ రాజేశ్వర్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా పౌరసంబంధాల అధికారి సంపత్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా జిల్లా స్థాయిలో ఈ నెల 11న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రతిభా ప్రోత్సాహక పరీక్ష 2022–23 నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురిని ఎంపిక చేసి జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. పోటీ పరీక్షల్లో పట్టు సాధించడానికి, విద్యార్థి తన అభ్యసన స్థాయి స్వీయ మూల్యాంకనం చేసుకునే అవకాశం ఇస్తూ మరింత మెరుగులు దిద్దుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. పరీక్షల్లో 124 పాఠశాలల నుంచి 363మంది తెలుగు, 25మంది ఆంగ్ల మాధ్యమం విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 8మంది ముఖ్య పర్యవేక్షకులు, శాఖ అధికారులు, 35మంది ఇన్విజిలేటర్లు, నలుగురు అబ్జర్వర్లను నియమించామని వివరించారు. బెల్లంపల్లి బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 175మంది, లక్సెట్టిపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 170మంది, మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 150మంది, చెన్నూర్ ప్రభుత్వ పాఠశాలలో 125మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యలో ప్రతిభ కనబర్చిన ఐదుగురికి ట్యాబ్‌తోపాటు ఇంటర్మీడియెట్ స్టడీ మెటీరియల్ అందజేస్తామని పేర్కొన్నారు.


ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కేసులు, ఈడీ విచారణను నిరసిస్తూ శుక్రవారం బెల్లంపల్లిలోని కాంటా చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో దహనం చేశారు. బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కేంద్ర ప్రభుత్వం కవితపై కేసులు పెడుతోందని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఇరికించి ఈడీతో విచారణ చేయించడం కుట్రలో భాగమేనని విమర్శించారు. విచారణను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు అన్వర్, మురుకూరి శ్రావణ్, సన్నీ యాదవ్, మహేందర్, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కాసర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా భూ కబ్జాలు!



అక్రమ పట్టాలు వెలుగులోకి వచ్చిన జన్నారం మండలం సింగరాయపేట చెరువు

- అధికార పార్టీ నేతలపై ఆరోపణలు
- సర్కారు భూముల్లో ఆక్రమణలు
- జిల్లాలో దారి తప్పుతున్న కొందరు లీడర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికారం చేతుల్లో ఉందని కొందరు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల అధికార పార్టీ నాయకులపై ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో పలు చోట్ల ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలూ పెరిగిపోతున్నాయి. స్థానిక నాయకులే ఆక్రమణలకు పాల్పడడంతో అడ్డు చెప్పేందుకు అధికారులు సైతం జంకుతున్నారు. దీంతో పలు చోట్ల సర్కారు స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. జిల్లా కేంద్రం మంచిర్యాలలోని పలు చోట్ల ఇప్పటికే అనేక భూములు కబ్జాల పాలయ్యాయి. ఈ కబ్జాల్లో అధికార పార్టీ నాయకులపై విమర్శలు ఉన్నాయి.

అధికారమే బలం

అధికారం ఉందని కొందరు నేతలు, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులపై ఒత్తిడి తెస్తూ తమకు అనుకూలంగా పనులు చేయించుకుంటున్నారు. దీంతో అధికారులకు తలనొప్పులు తప్పడం లేదు. అప్పట్లో ఓ బీఆర్ఎస్ నేత చెప్పినట్లు చేసి ఓ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ అప్పటి కలెక్టర్ భారతిహోళ్లికేరి ఆగ్రహానికి గురయ్యారు. ఇక కొందరు తమకు అనుకూలంగా ఉన్న వారినే బదిలీలు చేయించుకోవడం చేస్తున్నారు. చెప్పినట్లు వినాల ని, తమ పరపతి చూపిస్తున్నారని ఇప్పటికే ఒకరిద్దరు అధికారులు ఓ ప్రజాప్రతినిధికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇలాంటి వాటిని ఆదిలోనే అరికట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

- జన్నారం మండలం సింగరాయపేట చెరువులో అసైన్డ్ భూమి ఏడెకరాల్లో ఓ నాయకుడు ఐదెకరాలు, మరో నాయకుడు రెండున్నర ఎకరాలు పట్టా చేయించుకున్నారు. వాస్తవానికి ఇది భూ పరిమితి చట్టం కింద భూస్వాముల నుంచి తీసుకుని నిరుపేదలకు పట్టా చేసిన భూమి. ఇదంతా శిఖం కింద ఉంది. చట్ట విరుద్ధంగా తమ వారి పేరిట చేయించుకున్నారు. దీనిపై దుమారం రేపడంతో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ జోక్యంతో చివరకు పట్టా రద్దు చేస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. ఇదే మండలం కిష్టాపూర్ చెరువులో బీఆర్ఎస్ నాయకుడి అల్లుడి పేరుతో ఐదెకరాలు పట్టా చేయించుకున్నారు. జిల్లాలో కొందరు అధికార పార్టీ నాయకులూ భూ కబ్జాలకు పాల్పడుతున్నారు.
- ఇటీవల తాండూర్ మండలం రేచినీలో సర్వే నంబరు 612లో ప్రభుత్వ భూమిని స్థానిక ప్రజాప్రతినిధులే కబ్జా చేశారు. ఇద్దరు బీఆర్ఎస్ నాయకులు ''ప్రభుత్వ భూమి నువ్వు కబ్జా చేశావంటే నువ్వు చేశావు'' అంటూ బహిరంగంగానే ఆరోపించుకున్నారు. ఈ వ్యవహారంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ నేరుగా రంగంలోకి దిగి సదరు భూమిని రక్షించాల్సి వచ్చింది.
- భీమిని మండలంలో అసైన్డ్ భూములు కబ్జా చేసి బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ తన పరం చేసుకున్నారు. అసైన్డ్ భూములను తమ కుటుంబ సభ్యుల పేరుతో కబ్జా చేశారు.
- బెల్లంపల్లి పట్టణంలో సర్వే నంబరు 170లో గుంటలకొద్దీ ప్రభుత్వ భూములు ఆక్రమించుకుంటున్నారు. వాటిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు.
- మందమర్రి మండలంలో ఓ ప్రజాప్రతినిధి సీలింగ్, అసైన్డ్ భూములను చెరబట్టారు. తాను పదవిలో ఉన్నప్పటి నుంచే భూముల దందాలు సాగిస్తున్నారు. పాలవాగుతో సహా పలు చోట్ల ఆక్రమణలు చేశాడు.
- కోటపల్లి మండలానికి చెందిన ఓ నాయకుడు జిల్లా కేంద్రంతో సహా గోదావరి తీరం, మహారాష్ట్ర సరిహద్దులో పెద్దయెత్తున భూములు సంపాదించాడు. వివాదాస్పద భూములు కొనుగోలు చేసి అనతికాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ముఖ్య నాయకుడి అనుచరులం అంటూ భూ దందాలు సాగిస్తున్నారు.
- నస్పూర్ పట్టణ పరిధిలో ప్రభుత్వ భూములు వివాదాస్పదం ఉన్న చోటస్థానిక నాయకులు జోక్యం చేసుకుంటూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. అనేక భూములు వివాదంలో ఉన్నాయి.
- చెన్నూర్ పట్టణంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు లిటిగేషన్ భూముల్లో కబ్జాలు చేస్తూ సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. గెర్రె కాలనీ పరిధిలో ఇలాంటి వివాదాలు వెలుగులోకి వస్తున్నాయి.

కొనలేం.. తినలేం



కూరగాయలు

- పెరుగుతున్న కూరగాయల ధరలు
- జిల్లాలో సాగు తగ్గించిన రైతులు
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- అమాంతం పెరిగిన ధరలు
- ఆందోళనలో నిరుపేద కుటుంబాలు

బెల్లంపల్లి: ఎండలు ముదురుతుండగా కూరగాయల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. పక్షం రోజుల వ్యవధిలో కొన్ని రకాల కూరగాయల ధరలు కిలోకు గరిష్టంగా రూ.25 వరకు పెరిగాయి. టమాటా, కాకరకాయల ధరలు కాస్త దిగువ స్థాయిలో ఉండడం విశేషం. రోజురోజుకూ ధరలు పెరుగుతుండగా సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. క్యాలీఫ్లవర్, పచ్చిమిర్చి, వంకాయ, బీరకాయ, దొండకాయ, బీన్స్, క్యారెట్, కొత్తిమీర తదితర రకాల కూరగాయల ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. వేసవి ఆరంభం నుంచే ధరలు మండిపోతుండగా ముందు మరెంతగా పెరుగుతాయోననే ఆందోళన ప్రజల్లో ఉంది. వచ్చే మరో మూడు నెలల వరకు ధరల పెరుగుదల ఆకాశానికి నిచ్చెన వేస్తాయేమోనని గుబులు చెందుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, లక్సెట్టిపేట, మందమర్రి, రామకృష్ణాపూర్, శ్రీరాంపూర్, బెల్లంపల్లి, తాండూర్(ఐబీ), దండేపల్లిలో కూరగాయల మార్కెట్లు ఉన్నాయి. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం అంతంతమాత్రం కావడం, స్థానిక అవసరాలకు సరిపడా కూరగాయల సాగు కాకపోవడంతో అనివార్యంగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. హైదరాబాద్, కరీంనగర్ ప్రధాన మార్కెట్ల నుంచే కాకుండా నిజామాబాద్(అంకాపూర్), ఆదిలాబాద్ (గుడిహత్నూర్, తోషం, ఇంద్రవెల్లి), కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మదినేపల్లి ప్రాంతాల నుంచి తీరొక్క కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. జిల్లాలోని ప్రధాన మార్కెట్లలో రోజువారీగా అన్ని రకాల కూరగాయలు కలుపుకొని గరిష్టంగా ఎనిమిది నుంచి 10 టన్నుల వరకు, మంచిర్యాల మార్కెట్‌లో 15 టన్నుల వరకు అవసరముంటున్నట్లు తెలుస్తోంది. హోల్‌సేల్ వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుని స్థానిక మార్కెట్లలో ఉన్న మారువ్యాపారులతో అమ్మకాలు సాగిస్తున్నారు.

స్థానికంగా సాగు అంతంతే..

ప్రజా అవసరాలకు అనుగుణంగా స్థానికంగా కూరగాయల సాగు చేపట్టడం లేదు. ఆ దిశగా రైతాంగాన్ని ప్రోత్సహించడంలో ఉద్యానవనశాఖ అధికారులు తీవ్ర నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి. బెల్లంపల్లి, తాండూర్, దండేపల్లి, జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో కూరగాయలు పండిస్తున్నారు. జిల్లా ప్రజల అవసరాలకు సరిపోకపోగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. జిల్లావ్యాప్తంగా గరిష్టంగా 200 ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నట్లు అనధికారిక సమాచారం. ఇంత తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు సాగు, వేసవి ఆరంభం, మరోవైపు చీడపీడల ప్రభావంతో కూరగాయల ధరలకు రెక్కలు వస్తున్నాయి.

బెల్లంపల్లి మార్కెట్‌లో కూరగాయల ధరలు(కిలోకు రూ.లలో)

కూరగాయలు	15రోజుల క్రితం	ప్రస్తుతం
క్యాలీఫ్లవర్	40	60
పచ్చిమిర్చి	40	55
వంకాయ	20	35
బీరకాయ	90	100
కాకర	60	60
బీట్‌రూట్	40	50
టమాటా	30	20
చిక్కుడు	40	60
దొండ	50	70
గోరుచిక్కుడు	60	70
అలసంద	50	60
బీన్స్	40	60
క్యారెట్	30	50
కొత్తిమీర	20	40
తోటకూర	40	50

పేద, సామాన్యులపై భారం

కూరగాయల ధరలు పెరుగుతుండడంతో రెక్కాడితేగాని డొక్కాడని పేదలు, దినసరి కూలీలపై తీవ్ర ప్ర భావం పడుతోంది. పొద్దస్తమానం కష్టపడితే వచ్చే కూలి డబ్బులు కూరగాయలకే సరిపోని పరిస్థితులు ఉంటున్నాయని వారు వాపోతున్నారు. ధరల నియంత్రణపై ప్రభుత్వ చర్యలు లేకపోవడంతో మా రు వ్యాపారులు ప్రజాఅవసరాలను దృష్టిలో పెట్టుకుని ధరలు పెంచి అమ్మకాలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. పెరుగుతున్న ధరలను అదుపులోకి తేవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

భారం పడకుండా చూడాలి



కూరగాయల ధరలు రోజుకో తీరుగా ఉంటున్నాయి. వారం రోజుల్లో మూడుసార్లు పెరిగాయి. ఎండలు ఇప్పుడిప్పుడే ముదురుతున్నాయి. అయినప్పటికీ కూరగాయల ధరలు పెంచి అమ్ముతున్నారు. 15 రోజుల్లో కొన్ని రకాల కూరగాయల ధరలు కిలోకు రూ.20 వరకు పెరిగాయి. ముందు ఇంకా ధరలు పెరిగే అవకాశాలున్నాయి. ధరలు పెంచకుండా చర్యలు తీసుకుని పేద, సామాన్యులపై భారం పడకుండా చర్యలు తీసుకోవాలి.

– సోకాల లక్ష్మి, గృహిణి, బెల్లంపల్లి

ధరలు నియంత్రించాలి



నిత్యావసరాల ధరలతో సమానంగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ఇంతకుముందు వారానికోసారి ఇంటి అవసరాలకు సరిపడా కూరగాయలు తీసుకువెళ్లేవాళ్లం. ఇప్పుడు ఏరోజుకారోజు కొని తెచ్చుకుంటున్నాం. ధరలు ఎప్పుడు నిలకడగా ఉంటాయో తెలియడం లేదు. ప్రభుత్వం కూరగాయల ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

– రఘు, తినుబండారాల తయారీదారు, బెల్లంపల్లి

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలు



డీఐఈవో శైలజ

మంచిర్యాలఅర్బన్: 'ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ఈ నెల 15నుంచి ప్రారంభం కానున్నాయి. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా సీసీ కెమెరాల నిఘా నీడలో కట్టుదిట్టంగా నిర్వహించనున్నాం' అని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈవో) శైలజ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. పరీక్ష విధి విధానాలపై అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో 'సాక్షి'తో మాట్లాడారు.

ఎన్ని పరీక్ష కేంద్రాలు, ఎంతమంది విద్యార్థులు హాజరు కానున్నారు..?

డీఐఈవో: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు ఉంటాయి. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. 61 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు చెందిన 15,869 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 7,940, ద్వితీయ సంవత్సరం 7929 మంది పరీక్షలు రాయనున్నారు.

ఎలాంటి వసతులు కల్పిస్తారు. ?

డీఐఈవో: పరీక్ష కేంద్రాల్లో వెలుతురు ఉండేలా చొరవ తీసుకుంటున్నాం. ఫర్నిచర్, ప్రహరీ ఉన్న కళాశాలలను ఎంపిక చేశాం. తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎవరైనా అస్వస్థతకు గురైతే తక్షణం వైద్య సేవలు అందించేందుకు వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారు.

పరీక్షల నిర్వహణ కమిటీపై వివరిస్తారా..?

డీఐఈవో: ఇంటర్ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో హైపర్ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, డీసీపీ, ఆర్‌జేడీ సభ్యులుగా ఉంటారు. జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ(డీఈసీ) చైర్మన్ డీఈవో, ప్రిన్సిపాల్, లెక్చరర్‌తో కమిటీ ఉంటుంది. 24 మంది సీఎస్‌లు, 24 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, మంది కస్టోడియన్లు, సిట్టింగ్‌స్క్వాడ్స్–2, ఫ్లయింగ్‌స్క్వాడ్ పర్యవేక్షిస్తుంటాయి.

మాస్‌కాపీయింగ్ నిరోధానికి చర్యలేమిటి..?

డీఐఈవో: ప్రతీ కేంద్రంలో నిబంధన ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెడుతాం. 12 ప్రశ్నపత్రాల భద్రత కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష జరిగే సమయాల్లో స్థానికంగా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీప జిరాక్స్ కేంద్రాలు తెరిచి ఉండకుండా చూస్తాం. సిట్టింగ్‌స్క్వాడ్ బృందాలు పర్యవేక్షిస్తుంటాయి.

హాల్‌టికెట్ జారీపై వివరిస్తారా..?

డీఐఈవో: విద్యార్థుల హాల్‌టికెట్ల జారీలో ప్రైవేట్ కళాశాలలు పెట్టే ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వెబ్‌సైట్లో కూడా నేరుగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. కళాశాలల యాజమాన్యం సంతకం అవసరం లేకుండా నేరుగా హాల్‌టికెట్‌తో వెళ్లి పరీక్షలకు హాజరు కావొచ్చు. విద్యార్థులు పరీక్షా కేంద్రాల గుర్తింపునకు ఎగ్జామ్ సెంటర్ లోకేటర్ యాప్‌ను అందుబాటులో ఉంటుంది. పరీక్షల సమయంలో విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కౌన్సిలర్‌ను ఇంటర్ బోర్డు నియమించింది. 24గంటలపాటు అందుబాటులో ఉంటారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు మీరిచ్చే సలహాలు..

డీఐఈవో: విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదువుతూ అధ్యాపకులు, తల్లిదండ్రుల సూచనలు పాటించాలి. విద్యార్థుల్లో ఉండే భయం వీడేలా తల్లిదండ్రులు భరోసా కల్పించాలి. ప్రశ్నపత్రం ఇచ్చిన తర్వాత పది నిముషాలు క్షుణ్ణంగా చదువుకోవాలి. హాల్‌టికెట్ నంబరు రాయడం మరువొద్దు. పరీక్షకు కావాల్సిన సామగ్రిని ఎవరికి వారే తమ వెంట తెచ్చుకోవాలి.

చెన్నూర్‌కు అభివృద్ధి శోభ

- 15న ప్రారంభోత్సవాలు
- మంత్రి హరీష్‌రావు రాక



ప్రారంభోత్సవానికి ముస్తాబైన కేసీఆర్ పార్క్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాల్టీ అభివృద్ధి శోభను సంతరించుకుంది. రూ.కోట్లాది నిధులతో చేపడిన పనులు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి పట్టణం ముస్తాబవుతోంది. ఇటీవల ప్రభుత్వ విప్ బాల్క సుమన్ క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించడంతో సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 15న ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. రూ.7కోట్లతో నిర్మిస్తున్న 30పడకల ఆస్పత్రి భవనం పనులను మంత్రి పరిశీలిస్తారు.

ప్రారంభోత్సవాలు..

చెన్నూర్ పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రూ.25కోట్లతో నిర్మిస్తున్న నాలుగు వరుసల రోడ్డు, పెద్ద చెరువు, కుమ్మరికుంట చెరువులను రూ.9కోట్లతో మినీట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దారు. కస్తూర్బా పాఠశాల పక్కన రూ.5కోట్లతో నిర్మించిన మినీ స్టేడియం, రూ.2కోట్లతో నిర్మించిన కేసీఆర్ పార్కు, రూ.2కోట్లతో జోడు వాగు వద్ద అంబేద్కర్ ఎకో పార్క్, రూ.1.25కోట్లతో డంపింగ్ యార్డు, రూ.7.02 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం ప్రారంభిస్తారు.

శంకుస్థాపనలు..

చెన్నూర్‌లో రూ.40కోట్లతో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణం, పాతబస్టాండ్‌లో రూ.1.25కోట్లతో సమ్మక్క, సారలమ్మ భవనం, ఆర్టీసీ బస్సుడిపో పనులకు శంకుస్థాపన చేస్తారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడాలి



రక్తదానం చేస్తున్న తహసీల్దార్

కాసిపేట: సమాజంలో ప్రతీ వ్యక్తి అపోహలు వీడి రక్తదానంతో ప్రాణాలు కాపాడాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ కోరారు. శుక్రవారం కాసిపేట మండలం కల్వరి మినిస్ట్రీస్ కాసిపేట రెవెన్యూ శాఖ, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మినిస్ట్రీ నిర్వాహకులు సిస్టర్ శారోన్, బెల్లంపల్లి ఆర్డీవో శ్యామలదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు, గర్భిణులకు రక్తం అవసరాన్ని గుర్తించి రక్త నిల్వలు తక్కువగా ఉండడంతో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌లతోపాటు 151మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వేముల కృష్ణ, సపాటు శంకర్, అజ్మీర తిరుపతి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వైద్యులు, ఎంఆర్ఐ సులోచన, ఎంపీడీఓ ఎం.ఏ.అలీం, కల్వరి మినిస్ట్రీ నిర్వాహకులు శ్రీనివాస్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి

- పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించడానికి ప్రత్యేక దృష్టి సారించాలని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. పోలీసు కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులతో శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల ఫైళ్లు తనిఖీ చేశారు. కేసుల పురోగతిపై ఎస్‌హెచ్‌వోలను అడిగి తెలుసుకున్నారు. దొంగతనాల కేసుల్లో నేరస్తులను పట్టుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని తెలిపారు. ఫిర్యాదుదారుల సమస్యలపై తక్షణమే స్పందించి చట్టం పరిధిలో పరిష్కరించే దిశగా, న్యాయపరంగా కేసులు నమోదు చేయడం ద్వారా పోలీసులపై నమ్మకం కలుగుతుందని అన్నారు. పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు సైబర్‌క్రైమ్, విమెన్ సేఫ్టీ, షీ టీమ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని చెప్పారు. అనంతరం 5ఎస్ విధానం, ఫంక్షన్ వర్టికల్స్ విధుల్లో ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, పెద్దపెల్లి డీసీపీ వైభవ్ గైక్వాడ్, ఏసీపీలు సీఐలు, ఎస్సైలు, రైటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి గాయాలు

సిర్పూర్(టి): లోనవెల్లి గ్రామ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన ఇదే గ్రామానికి చెందిన అవ నీధర్‌గౌడ్‌పై ఎలుగుబంటి దాడి చేయగా గాయపడ్డాడు. ఆ తర్వాత ఎలుగుబంటి పారిగాం గ్రామం వైపు వెళ్లగా ఆ గ్రామస్తులు తరిమికొట్టారు. దీంతో అది టోంకిని గ్రామం వైపు వెళ్లింది. ఈ గ్రామ సమీపంలో ఇదే గ్రామానికి చెందిన చౌదరి భువనేశ్వర్‌పై దాడి చేసి గాయపర్చింది. గాయపడ్డవారిని వారి కుటుంబ సభ్యులు సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్: రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్.బలరాంకు లేఖ రాసినట్లు బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అన్ని విభాగాల్లో అనుభవజ్ఞులైన స్పెషలిస్టులను నియమించాలని, క్వాలిటీ స్టాండర్డ్ మెడిసిన్ అందుబాటులో ఉంచాలని లేఖలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

మెడికల్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

నస్పూర్: సింగరేణిలో పని చేస్తూ పదో వేజ్ బోర్డు పరిధిలో 01.07.2016 తర్వాత రిటైర్డ యిన, మెడికల్ అన్‌ఫిట్, మరణించిన ఉద్యోగులు ఈ సంవత్సరం మార్చి 31లోపు మెడికల్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటనలో కోరింది. పూర్తి వివరాలకు కార్మికులు విధులు నిర్వర్తించిన ఆయా గనుల సంక్షేమాధికారులను సంప్రదించాలని సూచించింది.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు


కొండపల్లిలో మాట్లాడుతున్న మహేశ్

పెంచికల్‌పేట్: బాల్యవివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) మహేశ్ హెచ్చరించారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో బాల్య వివాహాలు చేస్తున్నారనే ముందస్తు సమాచారంతో శుక్రవారం బాలిక కుటుంబ సభ్యులకు బాలికల సంరక్షణ అధికారులు ఐసీడీఎస్ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా పెద్దలు, పూజారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల్యవివాహాలు జరిగితే 1098కి సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ సంజీవ్, ఎస్సై విజయ్‌కుమార్, శ్రీమతి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

సందర్శించి.. తెలుసుకుని


పార్‌పెల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

● ముగిసినట్రైనీ అధికారుల క్షేత్రస్థాయి పర్యటన ● ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యక్ష పరిశీలన ● 'సాక్షి'తో మనోగతం వెల్లడి

లక్ష్మణచాంద: వారంతా ట్రైనీ అధికారులు.. వీరిలో ఒకరు శిక్షణ ఐఈఎస్ కాగా, నలుగురు శిక్షణ ఐఎస్ఎస్ ఆఫీసర్లు. ఈ నెల 4వ తేదీ నుంచి నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, కుభీర్ మండలాలను సందర్శించారు. ఇందులో ఐదుగురు లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి గ్రామానికి వచ్చారు. శిక్షణలో భాగంగా వీరు ఆరురోజులుగా గ్రామంలోనే ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, వాటి అమలు తీరు, గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులు, ప్రధాన వృత్తులు, సాగు చేస్తున్న పంటలు, సాగునీటి వసతి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం పర్యటన ముగించుకున్నారు. ఈ సందర్భంగా వారిని 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలు వెల్లడించారు.

అవకాశం వస్తే తెలంగాణలో పని చేసేందుకు సిద్ధం



మాది ఉత్తరప్రదేశ్. తండ్రి సంత్‌కుమార్ సింగ్, తల్లి సావిత్రీదేవి. మాది మధ్యతరగతి కుటుంబం. తండ్రి విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ నన్ను చదివించారు. విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలోనే జరిగింది. తండ్రి పడుతున్న కష్టం నేరుగా చూసి ఎలాగైనా మంచి ఉద్యోగం సాధించాలనే తపనతోనే ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. అదే పట్టుదలతో చదివి 2020లో ఐఎస్ఎస్ 15 ర్యాంక్‌తో సాధించాను. నేడు ఐఎస్ఎస్ ట్రైనింగ్ కోసం ఇక్కడకు వచ్చాను. ఇక్కడ పథకాలు, ప్రజల మంచి తనం చూసి ఆశ్చర్యానికి గురయ్యాను. నాకు తెలంగాణలో అవకాశం వస్తే తప్పకుండా పని చేస్తా.

– రాహుల్ సింగ్, ట్రైనీ ఐఎస్ఎస్ అధికారి

లక్ష్యం ముందే నిర్ణయించుకోవాలి



మాది ఢిల్లీ. నాన్న రాజేంద్రకుమార్, అమ్మ ఇంద్ర. నాన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగి, అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచి ఇష్టంతో చదివేదాన్ని. పాఠశాల స్థాయి నుంచి పీజీ స్థాయి వరకూ మొత్తం ఫ్రీగానే చదివాను. ఎంఏ ఎకనామిక్స్ ఢిల్లీలో చేశాను. సరైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగితే అనుకున్నది సాధించవచ్చు. పీజీ మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు మొదటిసారి గ్రూపు పరీక్ష రాశాను కానీ రాలేదు. రెండోసారి పట్టుదలతో చదివి 2023 ఐఈఎస్‌లో 16వ ర్యాంక్ సాధించాను. – షెఫాలీ, ట్రైనీ అధికారి

అన్ని రంగాల్లో అభివృద్ధి



కడెం: శిక్షణలో భాగంగా కడెం మండలం నచ్చన్‌ఎల్లాపూర్ పర్యటించాం. ఈ గ్రామంలో పరిశుభ్రత, ఇంకుడుగుంతల నిర్మాణాలు, పాఠశాల, బ్యాంక్ సేవలందించేందుకు కస్టమర్ సర్వీస్ పాయింట్ ఉన్నాయి. చక్కని పాలన అందించే పాలకవర్గం ఉంది. వ్యవసాయ ఆధారిత గ్రామంలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి కల్పిస్తే బాగుంటుంది.

– ఆలీషాఖానం, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్

పథకాల అమలు తీరు

ప్రజాసంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్తున్నాయా? లేదా? అనే అంశాల గురించి తెలుసుకునేందుకు నేరుగా ప్రజలతో మాట్లాడారు. పథకాల ఫలాలు అర్హులకు అందుతున్న తీరును ప్రజల ద్వారా తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు గల మౌలిక వసతులను ప్రత్యక్షంగా గమనించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామానికి గల రోడ్డు సౌకర్యం, గ్రామంలోని ఓపెన్ జిమ్, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, డంప్‌యార్డు, వైకుంఠధామాలను పరిశీలించారు. అలాగే గ్రామంలో సాగు చేస్తున్న పంటల వివరాలు నేరుగా రైతుల వద్దకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు.


పార్‌పెల్లిలో ట్రైనీ అధికారులు

పట్టుదలతో చదివి సాధించా



మాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. నాన్న వాసుదేవ్ సింగ్, అమ్మ నీలమ్ సింగ్. నాన్న ఓ ప్రైవేట్ ఉద్యోగి. చిన్నతనం నుంచి విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే కొనసాగింది. ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చేశాను. పట్టుదలతో చదివి చివరకు 2022లో ఐఎస్ఎస్‌లో నాలుగో ర్యాంక్ సాధించాను. ఇక్కడ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు సరైన లక్ష్యంతో ముందుకుసాగడం లేదు. పదో తరగతిలోనే లక్ష్యం నిర్దేశించుకునేలా కెరీర్ గైడెన్స్ ఏర్పాటు చేయాలి. – వీణాసింగ్, ట్రైనీ అధికారి

పల్లె వాతావరణం నచ్చింది



మాది ఉత్తరఖండ్ రాష్ట్రం. మా నాన్న జీవన్ చంద్రజోషి, అమ్మ లీలాజోషి. నాన్న ప్రైవేట్ ఉద్యోగి. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ చదివాను. మాది మధ్య తరగతి కుటుంబం. కష్టాలు దాటుకుంటూ లక్ష్యం కోసం చదివి చివరకు 2020లో ఐఎస్ఎస్ ఐదో ర్యాంక్ సాధించాను. ఇక్కడి పల్లె వాతావరణం చాలా నచ్చింది. పాఠశాలలో సైన్స్ ల్యాబ్స్, కంప్యూటర్ విద్యతో పాటు ఆంగ్లంపై పట్టు సాధించేలా చర్యలు చేపడితే ఉపయోగం.

– భావనాజోషి, ట్రైనీ అధికారి

కష్టాలను జయించి..



మాది ఢిల్లీ. మా నాన్న బాబులాల్ మీన్, అమ్మ రామ్‌పతి మీనన్. నాన్న ప్రైవేట్ ఉద్యోగి కావడంతో మా చదువుల కోసం అతడు అనేక కష్టాలు పడ్డారు. నేను ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పీజీ చేశాను. కష్టాలను అధిగమించి చదువులపై దృష్టి సారించి 2021లో 45వ ర్యాంక్ సాధించాను. సాధించాలనే తపన ఉంటే కష్టాలు అడ్డుకావు.

– గోవర్ధన్ మీనన్, ట్రైనీ అధికారి

నీటి విలువ గురించి తెలియజేశాం



కడెం: నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఆరురోజుల పాటు పర్యటించాం. గ్రామంలో అన్ని వసతులు బాగున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రభుత్వం నల్లా నీటిని అందించడం బాగుంది. కానీ.. చాలా వరకు ఇళ్లలో ఆన్.. ఆఫ్ బిగించనందున నీరు వృథాగా పోతోంది. గ్రామస్తులు నీటి వృథాను అరికట్టాలి. నీటిని పొదుపుగా వాడుకోవాలి

– సందీపన్ సర్కార్, ఇండియాన్ స్టాటిస్టికల్ సర్వీస్

గ్రామీణ జీవన విధానం బాగుంది



ఖానాపూర్: మండలంలోని మారుమూల గ్రామమైన ఎర్వచింతల్ ప్రజల జీవన విధానం బాగుంది. అత్యధిక మంది ఈ గ్రామంలో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు ఈ ప్రాంతం ఎగువభాగం కావడంతో బ్యాక్‌వాటర్‌లో ఎంతోమంది చేపలు పట్టి జీవనాన్ని సాగిస్తున్నారు. చేపలు విక్రయించేందుకు వీరికి మార్కెట్ సౌకర్యం కల్పిస్తే వీరి జీవనం మరింత సాఫీగా ఉంటుంది.

– శిఖ, ట్రైనీ అధికారిణి

ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించాం



ఖానాపూర్: హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం అధికారుల ఆదేశాల మేరకు ఆరురోజులపాటు శిక్షణ తీసుకున్నాం. ఇక్కడ స్థానిక అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సాదరంగా ఆహ్వానించి వసతి కల్పించారు. గ్రామంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. ఈ శిక్షణ నివేదికను కలెక్టర్‌తోపాటు శిక్షణ కేంద్రంలో అందజేస్తాం. గ్రామస్తుల ప్రేమ, ఆప్యాయతలు మరువలేనివి.

– ఛాయా, ట్రైనీఅధికారిణి

పొనకల్ చెరువు హద్దుల గుర్తింపు


చెరువు హద్దులను గుర్తిస్తున్న డీఐవో

జన్నారం: మండలంలోని పొనకల్ ఊరచెరువు కబ్జాకు గురైనట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం డీఐవో గంగాధర్ ఆధ్వర్యంలో చెరువు విస్తీర్ణం గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 400లో 41.20 ఎకరాల భూమి ఉండగా అందులో కొంత కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో వేణు వచ్చి చెరువును పరిశీలించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల ప్రకారం డీఐవో గంగాధర్, తహసీల్దార్ వెంకటకిషన్, ఆర్ఐ భానుచందర్, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ హద్దులు నిర్ణయించారు. కొంత భూమిని ఆక్రమించేందుకు యత్నించగా అక్కడి వరకు హద్దులు ఏర్పాటు చేశారు. శాశ్వత హద్దులు ఏర్పాటు చేయాలని స్థానికులు ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలని సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, స్థానికులు కోరుతున్నారు.

ఒకే వేదికపై కవలల కల్యాణం


వివాహ వేడుకలో కవల సోదరులు, వధువులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వారిద్దరూ కవల సోదరులు.. కలిసి పెరిగారు.. కలిసి చదివారు.. ఒకే కంపెనీలో ఒకే రకమైన ఉద్యోగం చేస్తున్నారు. ఒకే వేదికపై కల్యాణంతో శుక్రవారం ఓ ఇంటివారయ్యారు. మంచిర్యాలకు చెందిన బోడకుంట ప్రభ, మల్లయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో సంతానంగా కవలలు అనిల్, సునీల్ జన్మించారు. పదో తరగతి వరకు ఒకే చోట చదివినా.. పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్ వివిధ కళాశాలల్లో చదివారు. జార్ఖండ్ రాష్ట్రం బొకారాలోని కోలిండియా కంపెనీలో ఒకేచోట అసిస్టెంట్ మేనేజర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని పద్మావతి గార్డెన్స్‌లో 15నిమిషాల తేడాతో అనిల్ వివాహం రాపల్లికి చెందిన అనూషతో, సునీల్ వివాహం సోమగూడెంకు చెందిన ఉషామణితో జరిగింది.

వేతనాలు పెంచాలని ఓబీ కార్మికుల ఆందోళన

రెబ్బెన(ఆసిఫాబాద్): వేతనాలు పెంచాలని బెల్లంపల్లి ఏరియాలో ఖైరిగూడ ఓసీపీలో ఓబీ పనులు చేస్తున్న కార్మికులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి సమ్మె బాట పట్టగా శుక్రవారం కార్మికులంతా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మిక చట్టాలకు అనుగుణంగా వేతనాలు అందించడం లేదని, ప్రస్తుతం 26 మస్టర్లకు రూ.18,050 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. కోల్ ఇండియాలోని బొగ్గు గనుల్లో ఓబీ కార్మికులకు ఇస్తున్న తరహాలో తమకూ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వేతనానికి అదనంగా మరో రూ.3వేలు పెంచితే విధులకు వెళ్తామని స్పష్టం చేశారు. కార్మికుల పక్షాన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఓబీ కాంట్రాక్ట్ సంస్థతో సంప్రదింపులు జరిపినా ఎలాంటి స్పష్టత రాకపోగా కార్మికులు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. అలాగే గోదావరిఖని, రామగుండం ఏరియాలో పని చేస్తున్న ఓబీ కార్మికులకు పెంచినట్లుగా తమకూ పెంచాలని డిమాండ్ చేశారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని కొండపల్లికి చెందిన గద్దెలపల్లి సాయికుమార్ (27) మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై భూమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. మూడు నెలల క్రితం పని మానేసి కొండపల్లికి వచ్చి తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఎవరితోనూ మాట్లాడకుండా తనలో తానే బాధపడుతూ మానసికంగా కుంగిపోయేవాడు. తల్లిదండ్రులు నచ్చజెప్పినా అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈక్రమంలో గురువారం తల్లిదండ్రులు బంధువు వివాహానికి వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్నం తన తండ్రికి ఫోన్ చేసిన సాయికుమార్ ఇంటికి ఎప్పుడు వస్తున్నారని అడిగి తెలుసుకుని ఫోన్‌కట్ చేశాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి పైకప్పు ఇనుప పైపునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌చారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రం అందుకుంటున్న రామకృష్ణ


కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ

జైపూర్: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2023 జనవరిలో ఇన్వెస్టిగేషన్, ఎస్‌హెచ్‌వో వర్టికల్స్ కేటగిరీ త్రీలో ప్రథమ స్థానం వచ్చినందుకు నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో సీపీ రెమారాజేశ్వరి చేతుల మీదుగా జైపూర్ ఎస్సై రామకృష్ణ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జైపూర్ పోలీస్‌స్టేషన్‌లోని స్టేషన్‌రైటర్, వర్టికల్స్, వారెంట్ వర్టికల్స్ లోనూ ఉత్తమంగా పోలీస్‌స్టేషన్‌ను నిలిపినందుకు కానిస్టేబుళ్లు సురేశ్, భాస్కర్‌గౌడ్‌కు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం వర్టికల్స్‌లో ఉత్తమంగా ఎంపికయ్యేలా కృషి చేసిన జైపూర్ ఎస్సై రామకృష్ణ, సిబ్బందిని మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్, జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ రాజు, ఉన్నతాధికారులు అభినందించారు.

దేవాపూర్ కానిస్టేబుళ్లకు అవార్డులు

కాసిపేట: దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎండీ షఫీ, జీ శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ కనబర్చినందున సీపీ రెమారాజేశ్వరి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పోలీస్‌స్టేషన్ రైటర్, వర్టికల్స్ బ్లూకోల్ట్స్ వర్టికల్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందున పురస్కారం అందించినట్లు తెలిపారు. సీపీ చేతులమీదుగా అవార్డులు అందుకున్న వీరిని ఎస్సై విజయేందర్, తోటి సిబ్బంది అభినందించారు.

నెలాఖరులోగా సీపీఆర్ఎంఎస్ సభ్యత్వం తీసుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో అర్హులైన వారు ఈ నెలాఖరులోగా సీపీఆర్ఎంఎస్–ఎన్ఈ సభ్యత్వం తీసుకునేందుకు యాజమాన్యం చివరి అవకాశం కల్పించిందని మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో వేజ్‌బోర్డ్ తర్వాత సీపీఆర్ఎంఎస్–ఎన్ఈ సభ్యత్వం కోసం రూ.40 వేలు చెల్లించినవారు, ఇదివరకే ఎంతో కొంత సభ్యత్వ రుసుం రికవరీ అయినవారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఏరియాలోని గని సంక్షేమాధికారిని సంప్రదించాలని సూచించారు.

నీట్‌లో ర్యాంక్ రాదేమోనని విద్యార్థిని ఆత్మహత్య


వైష్ణవి మృతదేహం

రామకృష్ణాపూర్: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గద్దె రాగిడి ఆర్ఆర్‌నగర్‌లో ఉంటున్న గూడెపు వైష్ణవి (17) మందమర్రిలోని ఎస్ఎంజీసీ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. క్లాస్‌లో టాపర్‌గా ఉండే వైష్ణవి కొద్దిరోజులుగా ఆన్‌లైన్‌లోనే క్లాసులు వింటూనే నీట్‌కు ప్రిపేరవుతోంది. రెండేళ్లుగా ఒంటరిగా ఉంటూ నీట్ ర్యాంక్ గురించే ఎక్కువగా ఆలోచించేదని, ఈ క్రమంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు తెలిపారు. తండ్రి కామేశ్వర్‌రావు రిటైర్డ్ హెచ్ఎం కాగా, సోదరుడు ఎయిరోనాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సజీవ దహనం కేసులో బెయిల్ పిటిషన్ కొట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పరిధి గుడిపెల్లిలో గత డిసెంబర్ 16న జరిగిన సజీవదహనం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌ను ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ ఘటనలో మేడి లక్ష్మణ్, శనిగారపు సృజన, శ్రీరాముల రమేష్, వేల్పుల సమ్మయ్య, అర్నకొండ అంజయ్యలపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి మంచిర్యాల కోర్టులో హాజరుపర్చడం, రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. వీరిలో ఏ-1 లక్ష్మణ్, ఏ-3 శ్రీరాముల రమేష్, ఏ-4 వేల్పుల సమ్మయ్యలను డిసెంబర్ 23న పోలీసులు వారం రోజుల పోలీసు కస్టడీకి కోరగా ఆరు రోజులు 25నుంచి 30వరకు అనుమతి ఇచ్చారు. కాగా, శుక్రవారం నిందితుల తరఫున న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

వేసవిలో పశువులు, జీవాలు పదిలం




శ్రీనివాస్, పశువైద్యుడు

చెన్నూర్‌రూరల్: మార్చిలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఏప్రిల్, మేలో మరింత ముదరనున్నాయి. ఇప్పటికే పశువులు, జీవాలు అల్లాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.90లక్షల పశువులు ఉండగా, ఇందులో తెల్లజాతి (ఆవులు, ఎద్దులు) 1.80లక్షలు, గేదెలు 1.10లక్షలున్నాయి. గొర్రెలు 5.50లక్షలు, మేకలు 2లక్షలున్నాయి. ఈ క్రమంలో వీటిని ఎండవేడిమి నుంచి సంరక్షించుకునేందుకు పశుపోషకులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కత్తెరసాల పశువైద్యాధికారి శ్రీనివాస్ ఇలా వివరించారు.

- పశువులకు వేసవిలో మేత, దాణా సరిపడా అందించాలి.
- పచ్చిమేత దొరకకుంటే ఎండుమేతతోపాటు ఎక్కువగా దాణా ఇవ్వాలి.
- శుభ్రమైన చల్లనినీరు లభించేలా చూడాలి.
- కొట్టాల వద్ద చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. వీలైతే కొట్టాలపై గడ్డి కప్పి ఉంచాలి. కొట్టాల చుట్టూ తడకలు, గోనె సంచులు కట్టి వాటిపై నీళ్లు చల్లాలి. పశువులపై కూడా రెండు, మూడుసార్లు నీళ్లు చల్లితే మంచిది.
- గేదెలను చెరువులకు పంపి మధ్యాహ్నం కొంతసేపు అందులో ఉండనివ్వాలి. సాయంత్రం పాలు పితికే ముందు పశువును, పొదుగును చల్లని నీటితో కడగాలి.
- వేసవిలో గొర్రెలు, మేకల్ని జత కలిపి చూడి కట్టించాలి.
- మూడు నెలల వయసు దాటిన పిల్లలను తల్లుల నుంచి వేరు చేయాలి.
- పిడుదులు, గోమార్లు లేకుండా మూడు వారాలకోసారి మందు కలిపిన నీటిలో గొర్రెలను తడిపి తీయాలి.
- గొర్రెలు, మేకలు, ముఖ్యంగా పిల్లలకు వడగాడ్పులు తగలకుండా చూడాలి.
- మధ్యాహ్నం మేతకు బయటకు తీసుకువెళ్లవద్దు.
- బయట మేసే సమయంలో చెట్ల నీడ, తాగునీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలి.